# లక్షలో పది మందికి క్యాన్సర్ ప్రమాదం

- భారత్‌లో పెరుగుతున్న కేసులు
- విజృంభిస్తున్న ఉదర క్యాన్సర్
- బ్రిటన్ వైద్యుల ఆందోళన

**చెన్నై, న్యూస్‌టుడే:** భారత్‌లో ప్రతి లక్ష మంది జనాభాలో పది మందికి క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదముందని బ్రిటన్‌కు చెందిన వైద్యురాలు సరాహ్ ఓడ్వైర్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఇక్కడ మియాట్ ఆసుపత్రిలో ఇండో బ్రిటిష్ హెల్త్ ఇనిషియేటివ్(ఐబీహెచ్ఐ) వార్షిక సదస్సులో బ్రిటన్‌లోని క్రిస్టీన్ ఎన్‌హెచ్ఎస్ ఫౌండేషన్ ట్రస్ట్ కన్సల్టెంట్ కొలరెక్టల్ సర్జరీ నిపుణురాలైన సరాహ్ ఓడ్వైర్ ప్రసంగించారు. బ్రిటన్, భారత్ సహా ప్రపంచదేశాల్లో క్యాన్సర్ వ్యాధి పెరుగుతుండటంపై ఆమె ఆందోళన వ్యక్త చేశారు. ఉదర క్యాన్సర్ మరింత ఎక్కువగా వ్యాప్తి చెందుతోందన్నారు. బ్రిటన్‌లో ఇప్పుడీ వ్యాధితో 15 శాతం మంది బాధపడుతున్నారని గణాంకాలతో సహా వివరించారు. ఊపిరితిత్తులు, కాలేయం, కడుపు, బ్లాడర్ వంటి అనేక భాగాల్లో ఈ క్యాన్సర్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. ఆధునిక చికిత్సలతో పరిస్థితిని కొంతమేర అదుపు చేయవచ్చని తెలిపారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ పృథ్వీ

### 'హిపెక్'తో ఊరట

ఉదర క్యాన్సర్‌కు ఆధునిక 'హైపర్‌థర్మిక్ ఇంట్రా ఆపరేటివ్ పెరిటోనియల్ కెమోథెరపీ' (హిపెక్) విధానంతో కూడిన చికిత్సతో ఊరట కలిగించవచ్చని ఐబీహెచ్ఐ వ్యవస్థాపక కార్యదర్శి, మియాట్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీమోహన్ దాస్ అన్నారు. బ్రిటన్‌లో అందుబాటులో ఉన్న ఈ తరహా చికిత్స ఆ దేశం సహకారంతో ఇప్పుడు మియాట్ ఆసుపత్రుల్లోనూ ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. కడుపులో క్యాన్సర్ కారణంగా తలెత్తే సమస్యలను శస్త్ర చికిత్సలతో కడుపులో క్యాన్సర్ కారణంగా తలెత్తే సమస్యలను శస్త్ర చికిత్సా సమయంలో రసాయనిక ద్రవాలతో సరిచేయటం దీని ప్రత్యేకతని వివరించారు. 2011లో ప్రారంభమైన ఐబీహెచ్ఐతో ఆర్థో, గ్యాస్ట్రో, మధుమేహం చికిత్సలకు సంబంధించి సదస్సులు నిర్వహించగా ప్రస్తుత సదస్సులో క్యాన్సర్‌పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. బ్రిటన్‌తో పాటు పలు దేశాలకు చెందిన 40 మంది వైద్య నిపుణులతో పాటు మన దేశానికి చెందిన 500 మంది వైద్య ప్రతినిధులు సదస్సులో ముఖ్యాంశాలు, ప్రత్యక్ష శస్త్ర చికిత్స విధానాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వైద్య పరికరాలు, మందులు తయారు చేసే పలు ప్రముఖ కంపెనీలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి.



సదస్సులో దేశ, విదేశ వైద్య నిపుణులు



విదేశీ వైద్యులకు సన్మానం